
క్లుప్తంగా

నాగారం సెక్షన్ ఏఈ సంతకం ఫోర్జరీ?



నిజామాబాద్‌నాగారం: నగరంలోని టౌన్-3 సెక్షన్ పరిధిలోని నాగారం సెక్షన్ ఏఈ సంతకం ఫోర్జరీ చేసిన ఘటన కలకలం రేపుతోంది. ఫోర్జరీ సంతకం చేసిన ఫైల్ ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఇటీవల ఏఈ సెలవులో ఉండడంతో ఉద్యోగులు ఓ వినియోగదారుడికి సంబంధించిన టవర్‌కు సింగల్ ఫేజ్ మీటర్ ఇచ్చేందుకు ఫైల్‌పై ఏఈ సంతకం ఫోర్జరీ చేసి పెద్ద మొత్తంలో ముడుపులు అందుకున్నారని ఉద్యోగులే చర్చించుకుంటున్నారు. ఈనెల 18వ తేదీన నిర్వహించిన సమీక్షాసమావేశంలో ఫోర్జరీ వ్యవహారంపై చర్చ జరిగినట్లు తెలిసింది. తాను సంతకం చేయలేదని, దీనిపై ఏడీఈ, డీఈతోపాటు పైస్థాయి అధికారులకు ఫిర్యాదు చేస్తానని ఏఈ పేర్కొన్నట్లు సమాచారం.

కార్మిక హక్కుల రక్షణకు పోరాడుతాం

బోధన్: కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కుల రక్షణకు నిరంతరం పోరాడుతామని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రతినిధి ఆర్ సురేశ్ అన్నారు. భద్రాద్రి కొత్త గూడెం జిల్లా ఇల్లెందులో ఈ నెల 23న నిర్వహించే ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కౌన్సిల్ సమావేశానికి సంబంధించిన వాల్ పోస్టర్లను బుధవారం సాలూరలో నాయకులు ఆవిష్కరించారు. సమావేశాన్ని అన్ని రంగాల కార్మికులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. నాయకులు జగదీశ్, లక్ష్మణ్, చందు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలోని కేజీబీవీలో ప్రభుత్వం సరఫరా చేసిన పుస్తకాలు, దుస్తులను ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ మనస్విని బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్‌వో వినోద, వైస్ చైర్మన్ నాగమణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అల్బెండజోల్ మాత్రలపై అవగాహన ర్యాలీ


మామిడిపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

పెర్కిట్/ రుద్రూర్/ రెంజల్/ ఎడపల్లి: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో అల్బెండజోల్ మాత్రలపై వైద్యశాఖ సిబ్బంది బుధవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. 19 ఏళ్లలోపు ఉన్న ప్రతి ఒక్కరికి ఈ మాత్రలు అందేలా చూడాలని వైద్యులు సిబ్బందికి సూచించారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి, రుద్రూర్, రెంజల్, ఎడపల్లి మండలాల్లో వైద్యాధికారుల ఆధ్వర్యంలో ర్యాలీలు చేపట్టారు.


కోటగిరిలో..

ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు


ఆర్మూర్‌లో పండ్లు పంపిణీ చేస్తున్న వినయ్‌రెడ్డి

సాక్షి నెట్‌వర్క్: ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లోన్ని అన్ని గ్రామల్లో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు, అభిమానులు బుధవారం ఘనంగా నిర్వహించారు. పలు చోట్ల కేక్‌ల్ కట్ చేయగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు, బాలింతలకు పండ్లు పంపిణీ చేశారు. ఆర్మూర్‌లో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి బాలింతలకు, గర్భిణులకు పండ్లు పంపిణీ చేశారు. డొంకేశ్వర్, బోధన్, వర్ని, బాల్కొండ, కమ్మర్‌పల్లి, రెంజల్, ఎడపల్లి, రుద్రూర్ మండలాల్లో పార్టీ మండలాల అధ్యక్షులు కేక్ కట్ చేశారు.


కమ్మర్‌పల్లిలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

తాగునీటి సమస్య పరిష్కారానికి అమృత్ 2.0



- బోధన్ బల్దియాకు రూ. 50 కోట్ల నిధులు మంజూరు
- తీరనున్న ఇబ్బందులు

బోధన్‌టౌన్: బోధన్ బల్దియాలో తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కారం కానుంది. అమృత్ 2.0 కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బల్దియాకు రూ. 50 కోట్ల ప్రత్యేక నిధులు కేటాయించాయి. పట్టణంలో తాగునీటి సమస్య ఉండగా, మరో 14 ఏళ్ల పాటు పెరిగే జనాభాను దృష్టిలో ఉంచుకొని అమృత్ 2.0 పథకం ద్వారా నిధులు కేటాయించాయి. ఈ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. పట్టణాల ప్రగతే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం రూపొందించిన అటల్ మిషన్ రెజ్యువేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్ (అమృత్) 2.0, రాష్ట్ర ప్రభుత్వ పథకమైన మిషన్ భగీరథ సంయుక్తంగా 2038 నాటికి బోధన్ బల్దియాలో పెరిగే జనాభాకు రోజువారీగా 15 ఎంఎల్‌డీ తాగునీటిని సరఫరా చేసేందుకు ప్రతిపాదించిన పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే టెండర్లు పూర్తి కాగా చేయాల్సిన పనులను కూడా క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులు గుర్తించారు. సుమారు ఏడాదిన్నర క్రితం ప్రారంభమైన డీపీఆర్, సర్వే తదితర పనులు పూర్తయి ఇటీవల టెండర్ దశను దాటింది. ప్రజారోగ్య శాఖ ఈ పనులను పర్యవేక్షించనుంది.

బోధన్ బల్దియా పరిధిలో 38 వార్డులు ఉండగా 1లక్ష30వేల జనాభా ఉంది. వార్డుల్లో 17.500 ఇళ్లు ఉన్నాయి. ప్రస్తుతం పట్టణ ప్రజలకు బెల్లాల్ చెరువు ద్వారా తాగునీటిని సరఫరా చేసి అందిస్తున్నారు. ఈ చెరువు నుంచి పైప్‌లైన్ ద్వారా నీటిని తీసుకొచ్చి నీటిని శుద్ధి చేసి ప్రతి రోజు 23 లక్షల గ్యాలన్ల నీటిని సరఫరా చేస్తారు. వార్డుల్లో 10 వేలకు పైచిలుకు నీటి కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. ఇప్పటికే తాగునీటి సరఫరా కోసం బల్దియా ఆధ్వర్యంలో నిర్మించిన పట్టణంలోని రాకాసీపేట్, శక్కర్‌నగర్, రెంజల్ బేస్, బీటీనగర్, హౌసింగ్ బోర్డు కాలనీ, శక్కర్‌నగర్ చౌరస్తాల్లో వాటర్ ట్యాంక్‌లు ఉన్నాయి.

ఇప్పటికే పట్టణంలో సర్వే

అసెంబ్లీ ఎన్నిలకలకు ముందు అమృత్ పథకంలో మంజూరైన రూ. 50 కోట్లతో పనులు చేయడానికి ఎన్నికల కోడ్ అడ్డు వచ్చింది. టెండర్లు పూర్తి కావడం, ఎన్నికల కోడ్ ముగియడంతో అమృత్ 2.0 పథకానికి సంబంధించిన అధికారులు ఇప్పటికే పట్టణంలో సర్వే నిర్వహిస్తున్నారు. సర్వేలో పైప్‌లైన్ ఏర్పాటు, ట్యాంక్‌ల నిర్మాణాలు, ప్రస్తుతం ఉన్న కుళాయిలు, కావాల్సిన వాటి అంశాలపై సర్వే సాగుతోంది. పథకం సజావుగా పూర్తయితే పట్టణంలోని ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీటిని అందించడానికి కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాన్ని అనుసంధానం చేసుకొని అమలు చేస్తున్న పథకం అనుకున్న లక్ష్యాన్ని చేరుతుంది. ఉన్నతాధికారులు సైతం పనులు సకాలంలో పూర్తి చేసి ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని ప్రజలు కోరుతున్నారు.

అమృత్ 2.0లో..

పట్టణంలోని ప్రతి ఇంటికి తాగునీటిని అందించేందుకు ప్రవేశపెట్టిన అమృత్ 2.0లో రూ. 50 కోట్లు మంజూరు కాగా ఇందులో నూతనంగా వాటర్ ట్యాంక్‌ల నిర్మాణానికి ఆచన్‌పల్లి, శ్రీరాంనగర్ కాలనీ, రాకాసీపేట్‌లోని ప్రెస్ కాలనీ, అంబేడ్కర్ కాలనీ, అలియాబాద్, రెంజల్, వెంకటేశ్వర కాలనీల్లో స్థలాలను గుర్తించారు. వీటి నిర్మాణ పనులకు రూ. 7.68 కోట్లను కేటాయించారు. దీంతో పాటు వాటర్ ఫిల్టర్ బెడ్ నుంచి పట్టణంలోని వివిధ కాలనీల్లో నూతనంగా నిర్మించే వాటర్ ట్యాంక్‌లకు పైప్‌లైన్ అనుసంధానం చేయడానికి ఇప్పటికే 63 కిటో మీటర్లకు రూ. 16 కోట్లును కేటాయించారు. ప్లాంట్ల నుంచి 5.6 కిలో మీటర్ల మేర కనెక్టింగ్ కోసం రూ. 3 కోట్లు, పట్టణంలోని శివారు కాలనీతో పాటు ఇతర ట్యాప్ కనెక్షన్ ఏర్పాటుకు రూ. 2 కోట్లు నూతనంగా నిర్మించిన 7 వాటర్ ట్యాంక్‌ల చుట్టూ ప్రహరీ నిర్మాణానికి రూ. 1.30 కోట్లు, మెయింటెనెన్స్‌తో పాటు ఆపరేటింగ్, మీటర్ బల్బ్‌ఫ్లోల ఏర్పాటు, సర్వే, ఇతర నిర్వహణ కోసం రూ. 11 కోట్లు ఖర్చు చేసే విధంగా పథకాన్ని రూపొందించారు.

హరిపూర్‌ను జీపీగా ఏర్పాటు చేయాలి


హరిపూర్‌లో సమావేశమైన గ్రామస్తులు

పెర్కిట్: ఆర్మూర్ మండలం చేపూర్‌కు అనుబంధ గ్రామమైన హరిపూర్‌ను గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. హరిపూర్‌లో గ్రామస్తులు బుధవారం జీపీ ఏర్పాటు విషయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం 2023లో హరిపూర్‌ను జీపీగా ప్రకటించింది. దీంతో 50 ఏళ్ల కల నెరవేరిందని గ్రామస్తులు సంబురాలు చేసుకున్నారు. కానీ ఇప్పటి వరకు జీపీ ఏర్పాటుకు ప్రస్తుత ప్రభుత్వం ఎలాంటి కార్యాచరణ చేపట్టలేదు. 750 మంది ఓటర్లు ఉన్న హరిపూర్‌ను జీపీగా ఏర్పాటు చేయడానికి ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి చొరవ తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు ముందే ప్రభుత్వం నుంచి గెజిట్ విడుదల చేయించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ మహిళ అధ్యక్షురాలు స్వాతి, చిత్రలేఖ, వీడీసీ అధ్యక్షుడు ఎస్ రవి, పోష గౌడ్, నవీన్, సత్తయ్య, ఎల్లయ్య, గంగాధర్, రాజా గౌడ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

యువత శివాజీని ఆదర్శంగా తీసుకోవాలి


విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న పిట్ల కృష్ణమహరాజ్

రెంజల్: యువత ఛత్రపతి శివాజీ మహరాజ్‌ను ఆదర్శంగా తీసుకునాలని వక్తలు సూచించారు. మండల కేంద్రంలో బుధవారం శివాజీ విగ్రహావిష్కరణలో పాల్గొన్న మల్లారం శ్రీ లింగేశ్వర్ ఆశ్రమ వ్యవస్థాపకుడు పిట్ల కృష్ణమహరాజ్, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఇందూర్ విభాగ్ ప్రచారక్ నర్రా వెంకట శివకుమార్ వక్తలుగా పాల్గొని మాట్లాడారు. యువత చెడు వ్యసనాలకు అలవాటు పడి హిందూ ధర్మాన్ని కాలరాస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సన్మార్గంలో పయనించడం ఆర్ఎస్ఎస్ ద్వార సాధ్యపడుతుందని పేర్కొన్నారు. దేశం, ధర్మం కోసం యువత పాటు పడాలని సూచించారు. కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్త, ఎంపీపీ లోలపు రజని, జెడ్పీటీసీ మేక విజయ, బీజేపీ రాష్ట్ర నాయకుడు వడ్డి మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మర్ల రమేశ్ కుమార్, శివాజీ విగ్రహ ఉత్సవ కమిటీ సభ్యులు ఇర్ల రాజు, మెట్టు రంజిత్, బండి శ్రావణ్‌గౌడ్, ఆర్మూర్ సతీశ్, తుల క్రాంతి, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

దత్తాపూర్ చెరువు కబ్జాకు గురవుతోంది

- హద్దులు గుర్తించాలని తహసీల్దార్‌కు వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

డొంకేశ్వర్ : గ్రామంలోని పెద్ద చెరువు కబ్జాకు గురవుతోందని, హద్దులు గుర్తించి ఆక్రమణకు గురికాకుండా చూడాలని దత్తాపూర్ గ్రామస్తులు తహసీల్దార్ వెంకటరమణకు బుధవారం వినతిపత్రం అందజేశారు. 485 సర్వే నంబర్‌లో 106 ఎకరాల చెరువు శిఖం భూమి ఉందని, దీనిని కొంతమంది వ్యక్తులు ఆక్రమించడంతో పాటు మొరం తవ్వకాలు జరుపుతున్నారని తెలిపారు. కబ్జాలతో చెరువు కుచించుకుపోయి చిన్నదిగా మారుతోందన్నారు. సర్వే నిర్వహించి చెరువుకు హద్దులు ఏర్పాటు చేయాలని, అక్రమంగా మొరం తవ్వకాలు జరుపుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఇరిగేషన్ ఏఈ ప్రవీణ్‌కు ఫోన్ ద్వారా గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. త్వరలోనే సర్వే నిర్వహిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

అధికార దాహంతో పార్టీ మారే యత్నాలు


వర్నిలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

వర్ని: అధికార దాహంతో బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరే ప్రయత్నాలు చేస్తున్నారని వర్ని, చందూర్, మోస్రా మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపించారు. బుధవారం ఆయా మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశాల్లో మాట్లాడారు. గత 30 ఏళ్లుగా శ్రీనివాసరెడ్డి అధికారం ఉన్న పార్టీలో ఉంటూ అధికారాన్ని అనుభవించారని గత ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయి కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో అధికారం లేక శ్రీనివాస్‌రెడ్డి అల్లాడిపోతున్నారని ఆరోపించారు. పార్టీ మారే ప్రయత్నాన్ని ఎమ్మెల్యే విరమించుకోవాలన్నారు. సమావేశాల్లో కాంగ్రెస్ పార్టీ మండలాల అధ్యక్షులు సురేశ్ బాబా, శ్రీను, కొత్తిమీర్ కార్ లక్ష్మణ్, చందూర్ వైస్ ఎంపీపీ దశగౌడ్, వర్ని సొసైటీ మాజీ అధ్యక్షుడు వీర్రాజు, నాయకులు కుంకుమ దత్తు, సాయిలు, రాంబాబు వెంకటి గౌడ్, నారాయణ పాల్గొన్నారు.

‘డబుల్’ ఇళ్లు కేటాయించండి

- ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి


డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ఆర్మూర్: నియోజకవర్గంలో అర్హులైన వారికి రెండు నెలల్లో డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించాలని సంబంధిత అధికారులతో కలిసి ప్రభుత్వాన్ని కోరతామని ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అంకాపూర్, పట్టణంలోని పిప్రిగైని, పెర్కిట్–కొటార్మూర్ శివారుల్లో నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలను ఎమ్మెల్యే అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. నిర్మాణాలు పూర్తయిన వాటిని అర్హులకు గ్రామ సభలు ఏర్పాటు చేసి కేటాయించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్మూర్‌లో ఇంటిగ్రేటెడ్ కళాశాల నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించినందున కళాశాల ఏర్పాటుకు కావాల్సిన భూమిని ఎంపిక చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. నందిపేట మండలంలోని లక్కంపల్లి సెజ్‌లో పరిశ్రమల ఏర్పాటుకు పది చిన్న తరహా కంపెనీలు ముందుకు వచ్చాయని వాటితో యువతకు ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. ఆయన వెంట బీజేపీ నాయకులు కంచెట్టి గంగాధర్, ఆకుల రాజు, జాగిర్దార్ శ్రీనివాస్, జెస్సు అనిల్, శ్రీనివాస్, రాజు తదితరులు ఉన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై చర్యలు శూన్యం



భీమ్‌గల్: ఇసుక అక్రమ రవాణాపై పలుమార్లు తహసీల్దార్, ఆర్డీవోలకు విన్నవించినా చర్యలు శూన్యమని బీఆర్ఎస్ మండల నాయకులు ఆరోపించారు. ఎంపీపీ ఆర్మూర్ మహేశ్, జడ్పీటీసీ చౌట్‌పల్లి రవి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొన్కంటి నర్సన్న ఆధ్వర్యంలో నాయకులు కలెక్టర్, ఇన్‌చార్జి సీపీలకు బుధవారం వినతిపత్రం అందజేశారు. మండలంలోని బెజ్జోరాలో రెండు ప్రాంతాల నుంచి రాత్రి, పగలు అనే తేడా లేకుండా ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా జరుగుతోందన్నారు. అధికారులు వెంటనే ఇసుక అక్రమ రవాణ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

రెంజల్: లోటస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెంజల్‌లోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సంస్థ ప్రతినిధులు నోట్‌బుక్స్‌ను బుధవారం పంపిణీ చేశారు. రెంజల్‌లోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 120 మంది విద్యార్థులకు కావాల్సిన నోట్ బుక్స్‌ను ఉచితంగా అందించారు. మండల నోడల్ అధికారి ఆంజనేయులు దాతలను సన్మానించారు.

ఇసుక మాఫియాపై చర్యలు తీసుకోవాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

రుద్రూర్: పొతంగల్ మండలం మంజీరా నది నుంచి రాత్రి వేళ ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మహారాష్ట్రకు చెందిన ఇసుక మాఫియాపై చర్యలు తీసుకోవాలని శివారు రైతులు కోరుతున్నారు. ఈ మేరకు తహసీల్దార్ మల్లయ్యకు బుధవారం వినతి పత్రం అందచేశారు. పంట పొలాలకు నీరు పెట్టడానికి వెళ్లిన రైతులపై దాడి చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ సరిహద్దులో ఇసుక తవ్వకాలు జరిపితే భూగర్భ జలాలు అడుగంటిపోయి పంట పొలాలు ఎండిపోతాయని చెబుతున్నా వినిపించుకోకుండా ఆరుగురి రైతులపై దాడి చేశారన్నారు. రైతులపై దాడికి పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకుని అక్రమంగా ఇసుక తరలించకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

‘మోడల్’లో స్పాట్ అడ్మిషన్లు

బాల్కొండ: మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో 6, 7 తరగతులు, ఇంటర్‌లో ఖాళీగా ఉన్న సీట్ల కోసం గురువారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ శంకర్ బుధవారం ఒక ప్రకటలో పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ధ్రువపత్రాలతో పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

బాల్కొండ మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టుల భర్తీ కోసం గెస్ట్ టీచర్ల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శంకర్ పేర్కొన్నారు. హిందీ, కెమిస్ట్రీ, బోటనీ, ఇంగ్లిష్ పోస్టుల్లో ఖాళీగా ఉన్నాయని గెస్ట్ టీచర్లుగా బోధించేందుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పీజీలో 50 శాతం ఉతీర్ణత, బీఈడీ కలిగిన వారు అర్హులన్నారు. గురువారం ఉదయం పాఠశాలలో డెమో తరగతులు ఉంటాయని అర్హులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

విధులకు అతిథులు.. నిబంధనలకు అతీతులు


ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 10.50 గంటలకు ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు


అధికారులు, సిబ్బంది కోసం ఎదురు చూస్తున్న దరఖాస్తుదారులు

రెంజల్: సార్లకు సమయపాలన అవసరం లేకుండా పోయింది. విధులకు అతిథులుగా వస్తు నిబంధనలకు అతీతులుగా మారుతున్నారు. జిల్లా కేంద్రంలో ఉండి మండల కేంద్రాలకు వస్తు సమయపాలనను గాలికి వదిలేస్తున్నారు. గ్రామాలకు వచ్చే ప్రైవేట్ వాహనాలు, బస్సు వేళలే ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న వారికి సమయపాలనగా మారాయి. ఉదయం తొమ్మిదిన్నర నుంచి పది గంటల వరకు కార్యాలయాలకు రావాల్సిన ప్రభుత్వ ఉద్యోగులు ఇష్టారీతిన వస్తూ వెళ్తున్నారు. పట్టించుకోవాల్సిన పై స్థాయి అధికారులు పనుల పర్యవేక్షణ నిమిత్తం గ్రామాల్లో పర్యటిస్తున్నట్లు దాటవేస్తుండగా సిబ్బంది మాత్రం తమకు వచ్చిందే పని లేదంటే లేదని వచ్చిన వారిని దబాయిస్తున్నారు. అధికారులు, సిబ్బందిని ఎదిరించే అర్హతలేని సామాన్యులు గంటల తరబడి కార్యాలయాల ఎదుట నిరీక్షిస్తున్నారు. బుధవారం రెంజల్ ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 10.45 నిమిషాల వరకు ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. ప్రజాపాలన దరఖాస్తులను సవరించుకునేందుకు వచ్చిన మండలంలోని పలువురు గంటల తరబడి కార్యాలయంలో నిరీక్షించాల్సి వచ్చింది. తీరా 10.55 గంటలకు ప్రజాపాలన ఆపరేటర్ ఒకరు రావడంతో దరఖాస్తుదారులు అప్పటివరకు ఉన్న ఓపికను మర్చిపోయి క్యూలైన్‌లో నిలబడాల్సి వచ్చింది. తీరా వచ్చిన ఆపరేటర్ తమ పరిధిలోనిది కాదని ఇతర ఆపరేటర్ వస్తారని చెప్పడంతో లబ్ధిదారులు నిరుత్సాహానికి గురయ్యారు. ఈ విషయమై ఎంపీడీవో శ్రీనివాస్‌ను వివరణ కోరగా తాను పలు గ్రామాల్లో పనుల పరిశీలనకు వెళ్లాల్సి వచ్చిందని ఈ విషయమై తనకు సమాచారంలేదని దాటవేసే సమాధానం అందించి చేతులు దులుపుకొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


తాళ్లరాంపూర్‌లో గీత కార్మికుని కుటుంబాన్ని పరామర్శిస్తున్న మానాల మోహన్‌రెడ్డి

మోర్తాడ్: ఏర్గట్ల మండలం తాళ్ల రాంపూర్‌లో ప్రమాదవశాత్తు కాంగ్రెస్ కార్యకర్త తాటి చెట్టు పై నుంచి కిందపడి మృతి చెందిన గంగాధర్ కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి బుధవారం పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. అదే గ్రామానికి చెందిన చిట్యాల సాయమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని, నాగేంద్రనగర్ గ్రామానికి చెందిన ఎస్.కె. జలీల్ మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు దేవరెడ్డి, జెడ్పీటీసీ రాజేశ్వర్, బ్లాక్ ప్రెసిడెంట్ గంగాప్రసాద్, గడ్డం లింగారెడ్డి, రవి రెడ్డి, జీవన్‌రెడ్డి, రమేశ్, లింగారెడ్డి, అవులదేవన్న, క్యాతం నవీన్, శాంసన్, సంజీవ్ బాను, ఎండీ అస్ఫక్, శ్రీను, రఫీ, అనిల్, సృజన్, ప్రశాంత్, ఆశిరెడ్డి నరేశ్, రంజిత్ తదితరులు ఉన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో బంగారు భవిష్యత్తు



బాల్కొండ: ఆయిల్ పామ్ సాగుతో రైతులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్ అన్నారు. ఆయిల్ పామ్ సలహా మండలి సభ్యుడిగా ముప్కాల్ మండలం రెంజర్లకు చెందిన సొంగళి రాజేశ్వర్‌ను ప్రభుత్వం నియమించింది. దీంతో బుధవారం ముప్కాల్ మండలం రెంజర్లలో రైతు వేదికలో ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి జిల్లా ఉద్యానవన శాఖ అధికారి హాజరై మాట్లాడారు. ఆయిల్ ఫామ్ సాగుతో రైతులకు అనేక లాభాలు ఉన్నాయన్నారు. జిల్లా నుంచి రాజేశ్వర్ ఎంపిక కావడం గర్వ కారణమన్నారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆకుల చిన్న రాజన్న, ఉద్యానవన మండల అధికారి రోహిత్, రైతులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 -	మహారాజా (తెలుగు) - 12.45, 6.40, 9.45 మ్యూజిక్ షాప్ మూర్తి (తెలుగు) 3.50
స్క్రీన్-2 -	హరోం హర (తెలుగు) - 12.15, 3.30, 6.45, 10.00
స్క్రీన్-3 -	మనమే (తెలుగు) - 11.45, 3.00, 6.15, 9.30
స్క్రీన్-4 -	చందు చాంపియన్ (హిందీ) - 12.10, 6.05, 9.15, నీ దారే నీ కథ (తెలుగు) - 3.20